వైకుంఠధామాల్లో వసతులు కరువు

- నీటి వసతి అంతంతే
- పేరుకే వైకుంఠధామాలు
- కనిపించని దారి
- పెండింగ్‌లో రెండు శ్మశానవాటికలు

ఎల్లారెడ్డిపేట: చివరి మజిలీకి గౌరవం కల్పించాలని అన్ని గ్రామాల్లో అవసరమైన అన్ని వసతులతో వైకుంఠధామాలను నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో నీరుకారిపోతోంది. గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలను నిర్మించినా, పూర్తిస్థాయిలో వసతులు కల్పించకుండానే నిర్మాణాలు అయిపోయాయని అనిపించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించారు. వీటిలో ఎల్లారెడ్డిపేట, రాగట్లపల్లిలో నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. వాటిని అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు చేస్తున్న వినతులను పట్టించుకునేవారు లేరు. అలాగే మిగతా గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో అందుబాటులో ఉండాల్సిన నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు స్నానాల గదులు నిర్మించలేదు. వైకుంఠధామాలను అన్ని వసతులతో నిర్మించాలనే నిబంధనలను పట్టించుకోలేదు. అధికారులు ముందుచూపు లేకుండా నిర్మించడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది.

➡ గ్రామం నుంచి వైకుంఠధామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. దీంతో పొలం



అసంపూర్తిగా నిర్మించిన దూమాల వైకుంఠధామం

గట్లపై నుంచే మృతదేహాలను మోసుకెళ్తున్నారు.

➡ అంత్యక్రియల అనంతరం అక్కడే స్నానాలు చేసే పరిస్థితి లేక ఎంతోదూరం వెళ్లాల్సి వస్తోంది. కనీసం నీటి వసతి కల్పించడంలో విఫలమయ్యారు.

➡ విద్యుత్ సౌకర్యం లేక రాత్రివేళ దహన సంస్కారాలు చేయడం ఇబ్బందిగా మారింది.

➡ స్నానాల గదులు లేక మహిళలు స్నానాలకు, బట్టలు మార్చుకోవడానికి అసౌకర్యంగా ఉంది.

➡ ప్రహరీని నిర్మించలేదు. చివరి అంకంలో ప్రజలు మాత్రం కష్టాలు పడుతున్నారు.

ఆహ్లాదం గాలికి..

శ్మశానవాటికల్లో అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా 11 రోజుల పాటు అక్కడ అనేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమయంలో బాధ, దుఃఖంతో ఉన్న వారు సేద తీరేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు



ఇంకా పూర్తికాని వైకుంఠధామం పనులు



దారిలేని నారాయణపూర్ వైకుంఠధామం

మొక్కలు, ఇతర వసతులు కల్పించాలనే నిబంధనలున్నా వాటిపై దృష్టిపెట్టలేదు. శ్మశానవాటికల నిర్మాణం, వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకొని అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



వైకుంఠధామాల్లో అన్ని వసతులు కల్పించాలి. ముఖ్యంగా నీటి వసతి, స్నానాల గదులు, విద్యుత్ సౌకర్యం, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. అందుబాటులో నీటి సౌకర్యం లేక దూరంగా వెళ్లి స్నానాలు చేయాల్సి వస్తోంది. ఇబ్బందులు తొలగించాలి.

– మోతే మధుసూదన్‌రెడ్డి, నారాయణపూర్

అందుబాటులో ఏర్పాటు చేయాలి



శ్మశానవాటికలు ఊరికి దూరంగా కాకుండా అందుబాటులో ఉండాలి. మృతదేహాలను కిలోమీటర్ల దూరం మోసుకెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా గిద్దె చెరువు వద్ద ఉన్న వైకుంఠధామానికి వెళ్లేందుకు గంటల సమయం పడుతోంది. అందుబాటులో మరో శ్మశానవాటిక అన్ని వసతులతో నిర్మించాలి.

– ఊసి లక్ష్మి, ఎల్లారెడ్డిపేట

సమస్యలు పరిష్కరిస్తాం



మండలంలోని అన్ని వైకుంఠధామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం. మిగిలిన రెండు శ్మశానవాటికల నిర్మాణాలు పూర్తి చేస్తాం. వైకుంఠధామాల నిర్వహణ బాధ్యతతో పాటు అక్కడికే వెళ్లే రోడ్డు మార్గం గ్రామ పంచాయతీలు చూసుకోవాలి. త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీపీ

బోయినపల్లి: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పనులు తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. పురుగుల పట్టిన బియ్యం వస్తే తిప్పి పంపాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: స్థానిక ఆర్యవైశ్య, మున్నూరు కాపు, ముదిరాజ్ కుల సంఘాల భవన నిర్మాణ పనులకు ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. సంఘ భవనాలకు మంత్రి కేటీఆర్ రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారని, పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్ సుమతి, మూడు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీఐ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న సభ్యులు

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమాచార హక్కు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా జాయింట్ సెక్రెటరీ నేవూరి రత్నాకర్ తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చి 16 ఏళ్లు అవుతున్నా ఈ చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంలేదన్నారు. దరఖాస్తు ఎలా చేయాలో చాలామంది తెలియక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎర్ర బాలకిషన్, యశోద రాజు, దూస సత్యనారాయణ, జింక నరేశ్, సీసీఆర్ సభ్యులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు శివారులో చేపట్టాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాములు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు తీరు బాగానే ఉంది కాని, పట్టణ శివారు గ్రామాల్లో పర్మిట్ రూంలు, బెల్టు షాపులపై చెకింగ్ చేయట్లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. సోమవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. పట్టణంలో వాహనాల తనిఖీలతో ఆలస్యం కావడం వల్ల ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ వివిధ వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణంలో కాకుండా శివారుల్లో, బెల్టు షాపులు, పర్మిట్ రూంల వద్ద చెకింగ్‌లు పెడితే..ప్రమాదాలు నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సిరిసిల్లలో కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలు కట్టుదిట్టం చేయడాన్ని అభినందించారు. సమావేశంలో నాయకులు నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు, రాములు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడారి రాములు

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రమేశ్ కుమార్

కోనరావుపేట: మండలంలోని ధర్మారం, మోడల్ స్కూల్, కోనరావుపేట పదో తరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో రమేశ్‌కుమార్ సోమవారం సందర్శించారు. అనంతరం కేజీబీవీ సందర్శించి వంటగది, తరగతి గదులు పరిశీలించారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థినులతో మాట్లాడి వారికి అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి ఇందిర ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగుతో ఇబ్బంది

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం గాజులపల్లి, అగ్రహారం గ్రామాల్లో రోడ్లు, జనావాసాల మధ్య నుంచి మురుగు పారుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతూ అస్పత్రుల పాలవుతున్నారు. పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కారమార్గం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి:
హరిందర్‌రెడ్డి, కార్యదర్శి
ఫోన్ నంబర్: 90140 98978



ఫైలేరియా టెస్టులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం 6, 7 ఏళ్ల వయస్సుగల విద్యార్థిని విద్యార్థులకు ఫైలేరియా టెస్టులు నిర్వహించారు. వైద్య బృందం విద్యార్థులకు బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం జి.వెంకట్ రెడ్డి ఎస్‌ఎంసీ చైర్మన్ నరేశ్, సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ అసిస్టెంట్‌లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

సమాచారం

ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందజేస్తున్న ఉచిత సహాయ ఉపకరణాల కొరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 సంవత్సరానికిగాను రెట్రోపిట్టెడ మోటరైజ్డ్ వెహికల్స్, బ్యాటరీ వీల్ చైర్, లాప్‌టాప్, డైసీప్లేయర్స్, ఫోర్ జీ స్మార్ట్‌ఫోన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న, నిరుద్యోగ దివ్యాంగులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11 నుంచి 25లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్ తంగళ్లపల్లి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయడాన్ని మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు ఎప్పుడూ అభివృద్ధికి అడ్డురాలేదని అన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ కాంగ్రెస్ శ్రేణులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తంగళ్లపల్లి మండలం ఏర్పడి 6 ఏళ్లు గడుస్తున్నా మండల కేంద్రంలో ఉండాల్సిన వసతులు ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు నాశనమయ్యేలా పోటీ పరీక్షలను రద్దు చేయడం, పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ, రైతుల అంశాలపై నిలదీస్తారని భయంతో కాంగ్రెస్ నాయకులను అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. టోనితోపాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు.

నిర్బంధపాలన ఇంకెన్నాళ్లు?

ఎల్లారెడ్డిపేట: మండలంలో సోమవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు బీజేవైఎం మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రవీందర్‌నాయక్, నాయకులు అనిల్‌నాయక్, మహిపాల్‌ను సోమవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్న ప్రతిసారి ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేస్తూ నిర్బంధ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎల్లారెడ్డిపేట: ప్రహరీ కూలి మృతి చెందిన ఆరే దేవవ్వ, ఆరే అక్షయ అనే తల్లికూతుర్ల కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని బాల్యమిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సందుపట్ల లక్ష్మారెడ్డి అన్నారు. బాధిత కుటుంబానికి సోమవారం ఫౌండేషన్ తరపున రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. వారి కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామన్నారు. దాతలు ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాగుల ఎల్లారెడ్డి, డాక్టర్ హైమద్, గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, దేవరాజు, రాములు, యోహన్, మోహన్, మంజుల పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

బోయినపల్లి: మండలంలోని రామన్నపేట గ్రామంలోని బతుకమ్మ కుంట, శ్మశానవాటిక పరిసరాల్లో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కన్నం మధు, తహసీల్దార్ దర్పెల్లి నరేశ్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. శ్మశానవాటిక వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పాతిన హద్దు రాళ్లను తొలగించి భూ ఆక్రమణ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

ముస్తాబాద్: మద్దికుంట జీకే వెంచర్‌లో ఈనెల 12న నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు పిలుపునిచ్చారు. ముస్తాబాద్‌లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. ఐదు వేల మందితో భారీ సమావేశాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ సుమతి పాల్గొన్నారు.

సమస్యలపై రైతుల ప్రశ్నల వర్షం

- వాడీవేడిగా ప్యాక్స్ సర్వసభ్య సమావేశం
- సమస్యలపై సభ్యుల నిలదీత

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని సింగిల్ విండో సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. సోమవారం చైర్మన్ జీల కిషన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 సంవత్సరం ఆదాయ, వ్యయాల జాబితాను సీఈవో గౌరీశంకర్ చదివి వినిపించారు. అనంతరం సభ్యులు పలు సమస్యలపై బ్యాంక్ అధికారులను, పాలకవర్గాన్ని నిలదీశారు. ఇతర బ్యాంకులు ఒక ఎకరాకి రూ.లక్ష రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నారని, సొసైటీలో కేవలం దాదాపు రూ.30 వేల వరకే ఇస్తున్నారని, రుణ పరిమితి పెంచాలన్నారు. అన్ని రకాల రుణ సదుపాయాలను కల్పించాలన్నారు. చాలామందికి పంట రుణ మాఫీ కాలేదని, రుణ మాఫీపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంక్ అధికారి రాజు మాట్లాడుతూ బ్యాంక్ నిబంధనలకు లోబడి సొసైటీకి రుణాలు ఇస్తున్నామని, సొసైటీలోని రైతులతో సంబంధం లేదని తెలిపారు. నేరుగా ఎస్‌బీఐ శాఖను సంప్రదిస్తే వడ్డీ శాతం తగ్గుతుందని, నిబంధనల ప్రకారం అన్ని రకాల రుణ సదుపాయాలు పొందే అవకాశముందని తెలిపారు. బ్యాంక్ అధికారి సమాధానాలతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఎస్‌బీఎస్ ఫీల్డ్ ఆఫీసర్ తిరుపతి, 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, వైస్‌చైర్మన్ బెజ్జారపు నారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి రాజు

ఉపాధిహామీ పనులతో గ్రామాల అభివృద్ధి

వీర్నపల్లి: మండలంలోని బావుసింగ్ తండా, బాబాయి చెరువు తండా, మద్దిమల్ల తండా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సోమవారం జెడ్పీటిసి గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బావుసింగ్ తండాలో రూ.10 లక్షలతో కుంట నిర్మాణం, బాబాయి చెరువు తండాలో చెరువులో పూడిక తీత, మద్దిమల్లలో కోతి దేవయ్య చేపల కుంట నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల బాబాయి చెరువు తండా గ్రామ పంచాయతీకి ఉపాధి కూలీల శ్రమ మూలంగానే జాతీయ అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య లక్ష్మి, ఏపీవో శ్రీహరి, టీఏ నాగరాజు, సుజాత, కనుకవ్వ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గొర్రెల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: రెండో విడత గొర్రెల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించిందని, అర్హులైన వారు గొర్రెల యూనిట్లు పొందేందుకు డీడీలు తీసుకోని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల యాదవ సంఘం అధ్యక్షుడు ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ కోరారు. మండలంలోని కిష్టంపల్లిలో గొర్రెల కాపరులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. గొర్రెల కాపరులను ధనవంతుల్ని చేయడం కోసం ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు.

గడ్డివాము దగ్ధం



చందుర్తి: మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన గసికంటి లచ్చయ్య అనే రైతుకు చెందిన గడ్డివాము, ఎడ్ల బండికి సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమైంది. ఈ సంఘటనలో రైతు లచ్చయ్యకు సుమారు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. నష్టపోయిన రైతుకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అగ్రహారంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సర్పంచ్ మునిగె అమృత సోమవారం పంపిణీ చేశారు. నాయకులు దనాల ఉప్పలయ్య, కనుకయ్య, శంకర్, దేవయ్య, సురేష్, ఎల్లయ్య, ప్రశాంత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రాజిరెడ్డి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి 12వ వార్డు చంద్రంపేట చౌరస్తాలో విజయలక్ష్మి ఆటో గూడ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని కౌన్సిలర్లు పాతూరి రాజిరెడ్డి, పోచవేణి సత్య ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, పోచవేణి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ జాగిరి వేణు, యూనియన్ సభ్యులు ఉన్నారు.

బీరప్ప ఉత్సవాలు

కోనరావుపేట: మండలం మర్తనపేటలో బీరప్ప మహంకాళి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణ రావు, ఉపసర్పంచ్ పర్శరాములు, సింగిల్‌విండో డైరెక్టర్ కాసారపు శ్రీనివాస్, పెద్ద కురుమ కనకయ్య, కుర్మ సంఘం అధ్యక్షుడు ఇరుమల్ల తిరుపతి, జడ మల్లేశం, ఎగుర్ల నర్సయ్య పాల్గొన్నారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

సిరిసిల్లటౌన్: ఉపాధి కోసం ఎదురుచూస్తున్న ఓ నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందించి కౌన్సిలర్ కల్లూరి రాజు తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. 36వ వార్డులోని సుందరయ్యనగర్‌కు చెందిన జ్యోతికౌర్ అనే బీడి కార్మికురాలు కుటుంబ పోషణ కోసం ఇబ్బందిపడుతున్న విషయం తెలుసుకున్న రాజు సోమవారం ఆమెకు కుట్టుమిషన్ అందించి ఉపాధి మార్గం చూపాడు. కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్, కొక్కుల నర్సయ్య, ఇప్పపూల మల్లేశం, లక్ష్మి కౌర్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జవారిపేట, నర్సక్కపేట గ్రామాల్లోని హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య సోమవారం పరిశీలించారు. వేసవికాలం అయినందున మొక్కలకు ఎండ తగలకుండా షేడ్‌నెట్లను ఏర్పాటు చేయడంతో పాటు రోజుకు రెండు సార్లు మొక్కలకు నీరు పట్టాలని నిర్వాహకులకు సూచించారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో ఇంటింటా ఆరోగ్య సర్వే చేపట్టారు. కరీంనగర్‌లోని చల్మెడ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామంలో రెండు రోజుల పాటు ఇంటింటా తిరుగుతూ ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. బీపీ, షుగర్ ఇతర వ్యాధుల వివరాలు, వాడుతున్న మందుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. గ్రామంలో సర్వే పూర్తయిన అనంతరం శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు.